# జోరుగా వాహన విక్రయాలు

- దసరా సందర్భంగా షోరూంలలో సందడి
- కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ఆఫర్లు
- ద్విచక్రవాహనాలపై రూ.5 వేల వరకు తగ్గింపు

మెదక్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): విజయ దశమి, దీపావళి పండుగల సందర్భంగా విక్రయాలను పెంచుకునేందకు వాహన కంపెనీలు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దసరా పండుగ సందర్భంగా మెదక్ జిల్లాలో వాహన షోరూంలలో సందడి నెలకొంది. సులభ వాయిదాలపై కొనుగోలుకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. జీరో డౌన్ పేమెంట్‌లో బైక్ కొనే అవకాశం, గిఫ్ట్ ఆఫర్లు, డిస్కౌంట్లను కూడా ప్రకటిస్తున్నాయి. వాహన కంపెనీలతో పాటు వినియోగదారుడిని ఆకట్టుకోవడానికి డీలర్లు కూడా ఆఫర్లు ఇస్తున్నారు. హీరో, టీవీఎస్, బజాజ్, హోండా తదితర కంపెనీల బైక్‌లపై వివిధ రకాల ఆఫర్లను పండుగ సందర్భంగా ప్రకటించారు. హీరో మోటార్‌కు సంబంధించి మెదక్, తూప్రాన్ ప్రాంతాల్లో వివిధ రకాల ఆఫర్లను ప్రకటించారు. ప్రతీ బైక్ కొనుగోలుపై రూ.5 వేల నుంచి రూ.8వేల వరకు డిస్కౌంట్, జీరో డౌన్ పేమెంట్‌లో రుణాలు అందిస్తున్నారు. హెచ్‌ఎఫ్ 100, హీరో హెచ్ఎఫ్ డీలక్స్, స్ప్లెండర్ బైక్స్, స్ప్లెండర్ ఎక్స్ టెక్, ప్యాషన్ ప్లస్, సూపర్ స్ప్లెండర్ ఎక్స్ టెక్, గ్లామర్, ఎక్స్ ట్రీమ్ 4వీ, కరిజ్మా



మెదక్ పట్టణంలోని ఓ షోరూం ముందు కొత్త మోడల్ బైక్‌లు

ఎక్స్‌ఎంఆర్, డెస్టినీ ప్రైమ్, ప్లెజర్ ఎక్స్ టెక్ తదితర వాహనాలపై తగ్గింపు ఇస్తున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని షోరూంలు ముందు కొత్త మోడళ్ల బైక్‌లను ప్రదర్శనకు పెడుతున్నారు. దీంతో కొత్త వాహనాల బుకింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. వచ్చే రెండు రోజుల్లో అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందని వాహన కంపెనీలు పేర్కొన్నాయి.


పెద్దశంకరంపేటలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు

## వైభవంగా కుంకుమార్చనలు

పెద్దశంకరంపేట/చిన్నశంకరంపేట, అక్టోబర్ 17: పెద్దశంకరంపేట పట్టణంలోని తిర్మలాపురంలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మంగళవారం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

☛ మండల కేంద్రమైన చిన్నశంకరంపేటతో పాటు వివిధ గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మండపాల వద్దకు భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేసి, ఒడిబియ్యం సమర్పించుకొని మొక్కులను తీర్చుకున్నారు.


పట్టుబడిన నగదును సీజ్ చేస్తున్న ఎస్ఐ శివానందం

## వాహన తనిఖీల్లో రూ.లక్ష స్వాధీనం

తూప్రాన్, అక్టోబర్ 17: తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద మంగళవారం రూ.లక్ష నగదును తూప్రాన్ పోలీసులు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్ వెలువడడానికి ముందే తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు చెక్ పోస్టును ఏర్పాటు చేసి వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. వాహన తనిఖీల్లో భాగంగా హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఇన్నోవా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షను స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం వెల్లడించారు.

## బాధిత కుటుంబాలకు సునీతారెడ్డి పరామర్శ

నర్సాపూర్, అక్టోబర్17: నర్సాపూర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు పిల్లి సులోచన ఇటీవల మృతి చెందగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కరెంట్ షాక్‌తో గాయాలై చికిత్స పొందుతున్న పీఏసీఎస్ డైరెక్టర్ కృపాచారి ఇంటికి వెళ్లి పరామర్శించి, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. చైర్‌పర్సన్ వెంట మాజీ ఎంపీటీసీలు సత్యంగౌడ్, నర్సింహులు, కౌన్సిలర్ రామ్‌చందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో ఆఫీసులో మరమ్మతులు చేపట్టాలి


చిన్నశంకరంపేటలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శైలేశ్‌కుమార్

చిన్నశంకరంపేట, అక్టోబర్17: నిధులున్నా ఎంపీడీవో కార్యాలయానికి ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని జడ్పీ సీఈవో శైలేశ్‌కుమార్ ఎంపీడీవో ప్రవీణ్‌ను ప్రశ్నించారు. మంగళవారం ఆయన చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో శైలేష్‌కుమార్ మాట్లాడుతూ వెంటనే ఎండీవో కార్యాలయానికి మరమ్మతులను చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్‌కు సూచించారు. హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో వెంకటసాయి తదితరులు ఉన్నారు.

## చేగుంటలో స్పెషల్ ఫోర్స్ బలగాల కవాతు


చేగుంటలో కవాతు నిర్వహిస్తున్న స్పెషల్ ఫోర్స్ బలగాలు

చేగుంట, అక్టోబర్ 17: వచ్చే అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు కృషి చేస్తున్నారని చేగుంట ఎస్ఐ హరీశ్‌గౌడ్ తెలిపారు. చేగుంటలో హకీంపేట బెటాలియన్ 99డి ఆధ్వర్యంలో మంగళవారం కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసు బలగాలను ప్రదర్శించారు. ఈ కవాతులో అసిస్టెంట్ కమాండర్ సుశాంత్‌కుమార్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు కమాండర్లు, 8 మంది సబ్ ఇన్‌స్పెక్టర్స్ ఆఫ్ పోలీసు కమాండర్, 60 మంది సిబ్బందితో పాటు రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, మెదక్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, లైజనింగ్ ఆఫీసర్ మల్లయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారని ఎస్ఐ వెల్లడించారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పాపన్నపేట, అక్టోబర్17: మండలంలోని మిన్పూర్ గ్రామంలో మృతి చెందిన మాజీ ఉపసర్పంచ్ కాంతయ్య కుటుంబ సభ్యులను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ మర్రి లింగారెడ్డి, మాజీ ఎంపీపీ బాలాగౌడ్, బాబర్ పటేల్, లింగం, సాయిలు, జంగం రాములు, గంగారాం ఉన్నారు.


చేగుంటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

చేగుంట/చిన్నశంకరంపేట, అక్టోబర్ 17: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. మంగళవారం మండల కేంద్రమైన చేగుంట, నార్సింగితో పాటు వివిధ గ్రామాల్లో మహిళలు, చిన్నారులు గునుగు, తంగేడుతో పాటు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, గ్రామాల చావిడి వద్దకు బతుకమ్మ ఆటలు ఆడి, పాటలు పాడారు. అనంతరం చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. బతుకమ్మ వెంట తీసుకెళ్లిన నైవేద్యాన్ని ఒకరికొకరు పంచుకొని స్వీకరించారు. చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం మహిళలు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఉంచి మహిళలు బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.


బోనాల్‌లో రైతు వేదికలో తేనె ఉత్పత్తులపై మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇంద్రారెడ్డి

## గ్రామాల్లోనే స్వచ్ఛమైన తేనె ఉత్పత్తి

- రుతిక ఇన్నోవేషన్ సీఈవో ఇంద్రారెడ్డి

చేగుంట, అక్టోబర్ 17: గ్రామీణ ప్రాంతాల్లో మహిళా రైతులు స్వచ్ఛమైన తేనె ఉత్పత్తులను తయారు చేయవచ్చని 'రుతిక ఇన్నోవేషన్' సీఈవో ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సెహగల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేగుంట మండల పరిధిలోని బోనాల్ గ్రామంలో మంగళవారం తేనె తయారీ ఉత్పత్తులపై రైతు వేదికలో మహిళా రైతులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. తేనెటీగలు ఉన్న క్షేత్రంలో పంట ల దిగుబడులు అధికంగా వస్తాయని, తేనె తీసిన తరువాత ఉన్న మైనంతో కొవ్వొత్తులు, సబ్బులు తయారు చేయవచ్చని తెలిపారు. రైతులు ముందుకు వచ్చి తేనెటీగల పెంపకానికి కృషి చేయాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు మారుతి, అసిస్టెంట్ ప్రోగ్రాం లీడ్ ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రావణ్‌కుమార్, విజయ్, ఏఏవో ప్రవీణ్‌తో పాటు వివిధ గ్రామంలోని మహిళా రైతులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గం దవాఖానను వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలి


ఎంపీ బీబీ పాటిల్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బ్రహ్మం

అల్లాదుర్గం, అక్టోబర్17: అల్లాదుర్గంలోని దవాఖానను వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలంటూ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు అల్లాదుర్గం నియోజకవర్గం సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ అల్లాదుర్గంలో కొనసాగుతున్న ఆరోగ్య కేంద్రం 161వ జాతీయ రహదారికి సమీపంలో ఉందని, నిత్యం వేల సంఖ్యలో ప్రజలు తిరుగుతుంటారన్నారు. ప్రస్తుతం అరకొర వసతులతో దవాఖాన కొనసాగతుందని, వంద పడకలుగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు.